క్లుప్తంగా

అభివృద్ధికి ప్రణాళికలు అవసరం

చీరాల టౌన్: గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ విజయ సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, సచివాలయాల సెక్రటరీలు, మండల స్థాయి అధికారులతో కలిసి అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామ, మండల స్థాయిలో అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తుందని, గ్రామ పంచాయతీల కార్యదర్శులు తమ గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి అంచనాలు, ప్రణాళికలు తయారు చేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలని, అభివృద్ధి పనులకు నిర్ణీత సమయాల్లో పూర్తి చేసేందుకు కావాల్సిన నిధులను ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. సమావేశంలో ఈవో ఆర్డీ రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజు, పంచాయతీల సెక్రటరీలు, వీఏఓలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై పోలీసులకు అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చీరాల: సీపీఆర్‌పై మెరైన్, సివిల్ పోలీసులు, మత్స్యకారులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం రామాపురంలోని ప్లామ్‌కోస్ట్ రిసార్ట్స్‌లో ఐఎంఏ చీరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆపదలో ఉన్నప్పుడు వెంటనే వారిని రక్షించుకోవడానికి సీపీఆర్, డ్రోనింగ్ సమయంలో పొట్టలో ఉన్న నీటిని బయటకు తీసి ప్రాణాలు కాపాడే విధంగా మెరైన్, సివిల్ పోలీసులు, మత్స్యకారులకు అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌ఓ విజయమ్మ, డాక్టర్లు పి.శ్రీకాంత్, డి.రవికిరణ్, వీరేంద్ర, రూరల్ ఎస్సై ఎ.చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్లో వలపర్ల విద్యార్థినికి ద్వితీయ బహుమతి

మార్టూరు: చీరాలలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమంలో మార్టూరు మండలం వలపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని సెమినార్లో జిల్లా స్థాయి ద్వితీయ బహుమతి కైవసం చేసుకుంది. స్థానిక ఎస్‌ఆర్‌పీఎం పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సెమినార్ విభాగంలో వల పర్లకు చెందిన 9వ తరగతి విద్యార్థిని కార్యం పూడి వెంకట వేద జిల్లా స్థాయి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. నేడు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సెమినార్ పోటీలో వెంకట వేద పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సైన్స్ ఉపాధ్యాయులు నూక తోటి నాగేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

పరిశుభ్రత ముఖ్యం

పర్చూరు(చినగంజాం): పరిశుభ్రత వ్యక్తి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఎంతో ముఖ్యం అని చెరుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఇన్‌చార్జ్ వైద్యాధికారి, ప్రభుత్వ హోమియో వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నాగులపాలెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం వైద్యఆరోగ్య సిబ్బందితో కలిసి తగు సూచనలు చేశారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి. విశ్వరాణి, హెచ్‌ఈఓ సత్యనారాయణ, ఎస్‌యూఓ రవి, స్టాఫ్ నర్స్ భాగ్యలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ వెన్నెల, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పంగులూరులో నేత్ర దానం

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు గ్రామానికి చెందిన పెంట్యాల వెంకట నారాయణ (69) శుక్రవారం ఇంటి వద్ద అనారోగ్యంతో చనిపోయారు. కుటుంబ సభ్యుల అనుమతితో రోటరీ క్లబ్ వారి సహకారంతో, గుంటూరు శంకర్ నేత్రాలయం వారి ఆధ్వర్యంలో వైద్య బృందం వారు వెంకట నారాయణ నేత్రాలను స్వీకరించారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

చినగంజాం: ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, జూనియర్ కళాశాలలో శుక్రవారం మానసిక ఆరోగ్యంపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం పాఠశాల ప్రత్యేక అధికారి సుమాంజలి ఆధ్వర్యంలో నిర్వహించారు. బాపట్ల జిల్లా కెరియర్ గైడెన్స్.. మానసిక ఆరోగ్యం కౌన్సిలర్ గంటా ఇందిరా ప్రియదర్శిని ముఖ్య అతిథిగా విద్యాలయానికి విచ్చేసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె బాలికల కౌమార దశ, కౌమారదశ సమస్యలు, మానసిక ఆరోగ్యం, వ్యక్తిగత భద్రత తదితర అంశాలను వివరించారు. మండల విద్యాశాఖాధికారి బి. అజయ్‌బాబు తన విలువైన అనుభవాలను అందజేశారు.

ఆరోగ్యం-ఆనందం మీ చేతుల్లోనే..

కారంచేడు: ఆరోగ్యం, ఆనందంగా ఉండాలంటే వారి జీవితం వారి చేతుల్లో ఉండాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు వాసిరెడ్డి అమర్‌నాథ్ అన్నారు. శుక్రవారం కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. సెల్‌ఫోన్‌ల వలన పలు రకాల వ్యాధులు వస్తున్నాయన్నారు. గౌతమబుద్ధ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ యార్లగడ్డ రాఘవయ్య, ప్రధానోపాధ్యాయులు ఎస్. సామ్రాజ్యం పాల్గొన్నారు.

సీఎం వచ్చారు.. వెళ్లారు!

- అయినా అధ్వానంగా చినగంజాం - పెదగంజాం రోడ్డు
- సీఎం చంద్రబాబు రాకతో అయినా మారిందే లేదు


అధ్వానంగా ఉన్న చినగంజాం-పెదగంజాం రోడ్డు

చినగంజాం: మండల కేంద్రం చినగంజాం నుంచి పెదగంజాం గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. మేజర్ పంచాయతీ పెదగంజాం గ్రామానికి చేరాలంటే గతంలో కేవలం పడవ మార్గమే ఉండేది. అయితే రొంపేరుపై వంతెన నిర్మాణం చేసిన తరువాత మార్గం సుగమం అయింది. మండలంలోని రాజుబంగారుపాలెం పంచాయతీ అమీన్ నగర్ గ్రామం నుంచి రొంపేరు బ్రిడ్జి మీదుగా పెదగంజాం చేరుకోవాల్సి ఉంది. అయితే సుమారు రెండున్నర కిలోమీటర్ల పొడవున్న రోడ్డు గుంతల మయమై, గులక రాళ్ళు లేచి వాహనాలు రాకపోకలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. కొద్దిగా వర్షం కురిస్తే చాలు రోడ్డు అంతా నీరు నిలిచి, బురదమయమై పాదచారులకు, వాహనదారులకు, బస్సు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నెల 1న సీఎం చంద్రబాబు నాయుడు ప్రజావేదిక కార్యక్రమం కోసం పెదగంజాం పంచాయతీలోని ఆవులదొడ్డిగొల్లపాలెం వచ్చి వెళ్లారు. ఈ ప్రాంత అభివృద్ధికి తాను నిధులు మంజూరు చేయనున్నట్లు సభలో బహిరంగంగా ప్రకటించారు. ఆ తరువాత అధికారులు రొంపేరు బ్రిడ్జి నుంచి గొల్లపాలెం వరకు రోడ్డు మార్గాన్ని వేసేందుకు ప్రణాళికలు సైతం సిద్ధం చేశారు. ఇలా సీఎం ఈ ప్రాంతాన్ని సందర్శించి 7 నెలలు పూర్తి కావస్తున్నా అధికారులు రోడ్డు గురించి పట్టించుకోకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం ప్రజా ప్రతినిధులైనా పట్టించుకొని రోడ్డు మార్గాన్ని సౌకర్యవంతంగా నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


గుంతలమయమై రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న రోడ్డు

మెడికల్ కళాశాలలను కాపాడుకోండి


కోటి సంతకాల ఫాం చూపిస్తు మాట్లాడుతున్న కరణం వెంకటేష్


కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న గాదె మధుసూదన రెడ్డి

- వైఎస్సార్ సీపీ చీరాల నియోజవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్

వేటపాలెం: సీఎం చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న ప్రజావ్యతిరేక నిర్ణయాలకు అడ్డుకట్ట వేయాలని, ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ అడ్డుకోవాలని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ పిలుపునిచ్చారు. చీరాల నియోజకవర్గ రామకృష్ణాపురం, దేశాయిపేట, వేటపాలెం గ్రామాల్లో రచ్చబండ కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలు అవుతోందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండి ప్రజల పక్షాన పోరాటాలు చేయాలన్నారు. గత ఎన్నికల్లో చీరాల నియోజకవర్గంలో మూడు పార్టీలు పోటీ చేశాయని గుర్తు చేశారు. అందులో ఒక పార్టీ తరఫున నిలబడిన వ్యక్తి ఎన్నికల ముందు వరకు వైఎస్సార్ సీపీలో ఉండి ఎన్నికల ముందు ఇతర పార్టీలోకి వెళ్లి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మోసం చేసి చీరాల్లో పోటీగా నిలబడ్డారన్నారు. అటువంటి నాయకులు తిరిగి పార్టీలోకి వస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పార్టీని మోసం చేసి తిరిగి ఆ పార్టీలో చేరతాని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఈ విషయం నియోజకవర్గంలోని ప్రజలందరికీ తెలుసన్నారు. వైఎస్ జగన్‌మోన్ రెడ్డి కూడా పార్టీ కోసం పాటు పడే ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు సాధు రాఘవ, నియోజవర్గ మహిళా నాయకురాలు సీతా మహాలక్ష్మి, బోడ్డు సుబ్బారావు, కర్ణ లక్ష్మారావు, గుత్తి విశ్వేశ్వరరావు, బండికళ్ల నరేష్, దావీద్, దుబ్బు రాఘవయ్య, జోదన కోటిలింగం, బీరక ఖేదేశ్వరావు, మాజీ వైస్ చైర్మన్ జైసన్ బాబు, యాతం మేరీబాబు, వాసుమల్ల వాసు, అద్దంకి రెడ్డి, పిన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, కంచి సాంబిరెడ్డి, రామన్నపేట సర్పంచ్ కందేటి రమణ, పెద్దిరెడ్డి చెంచిరెడ్డి, ఢాకా రమణా రెడ్డి, రొండా శివారెడ్డి, దండా శ్రీనివాసరెడ్డి, బెంజిమెన్ తదితరలు పాల్గొన్నారు.


అద్దంకిలోని 5 వ వార్డులో కోటి సంతకాల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

కోటి సంతకాల సేకరణ విజయవంతం చేయండి

పర్చూరు(చినగంజాం): కూటమి ప్రభుత్వం చేపట్టిన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ నిర్వహించనున్న కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయంవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి పిలుపునిచ్చారు. పర్చూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమ పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం సంతకాల సేకరణ ప్రారంభించారు. పర్చూరు, కారంచేడు, యద్దనపూడి మండలాల కన్వీనర్‌లు కఠారి అప్పారావు, జువ్వా శివరాం ప్రసాద్, రావూరి వేణుబాబు, జిల్లా అధికారప్రతినిధి బండారు ప్రభాకరరావు, కొల్లా శ్రీహరి, కొసన రాము, గోరంట్ల శివకుమారి, ఐటీ వింగ్ అధ్యక్షుడు జి. రవిచంద్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుజ్జర్లపూడి చిన్న, పత్తిపాటి రవీంద్ర,కట్టా బుజ్జి, కట్ట జగదీష్, రామకృష్ణ, పేర్ని ఆంజనేయులు, ప్రచార అధ్యక్షుడు దాసరి వెంకటరావు, వాణిజ్య విభాగం అధ్యక్షుడు మువ్వల రాంబాబు, యూ అనిల్‌చౌదరి, బట్టు అనిల్ కుమార్, గొర్రె సురేష్, దొడ్ల రవి, షేక్ బుడే, నక్క పోతిరెడ్డి, అల్లా చెంచుబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు మొగిలి నాగేశ్వరరావు, సామ్యూల్, పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యక్తులకు దోచి పెట్టేందుకే పీపీపీ విధానం

అద్దంకి రూరల్: కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు దోచిపెట్టేందుకే పీపీపీ విధానం అవలంబిస్తోందని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చింతలపూడి అశోక్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాత్రి అద్దంకి పట్టణంలోని 5, 9 వార్డులో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నియోజకవర్గ ఇన్‌చార్జి అశోక్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు కూటమి ధారదత్తం చేసి పేద ప్రజలకు వైద్యం అందుబాటులో లేకుండా చేస్తోందన్నారు. బ్రోచర్ల ఆవిష్కరించిన అనంతరం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు కర్నేటి వెంకట ప్రసాద్, బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కాకాని రాధకృష్ణమూర్తి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.


సంతకాల సేకరణ

గవాయ్‌పై దాడి రాజ్యాంగంపై దాడే!

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషన్‌రామకృష్ణ గవాయ్‌పై అణగారిన దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని పల్లెపోగు మహేంద్ర మాదిగ అన్నారు. శుక్రవారం మందకృష్ణమాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఆర్, ప్రజా సంఘాల ఆధ్వరంలో సంతమాగులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. గవాయ్ దాడి వెనుక ఉన్న కుట్రలను విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో జిర్ర విజయ్‌బాబు, అమృతపూడి కరుణాకర్, చింతపల్లి సునీల్, లక్కపోగు జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్ల: సుప్రీం చీఫ్ జస్టిస్ బీఆర్ గవాయిపై జరిగిన దాడి అనాగరిక చర్య అని ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన కొరిశపాడులో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ దళితుడు కావడం వల్లనే ఈ దాడి జరిగిందని ఈ దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. దళితులు ఉన్నత స్థానాల్లో ఉండటం కొంతమందికి ఇష్టంలేదని గిట్టని వారే ఈ దాడులకు పాల్పడుతున్నారన్నారు. అలాంటి వారిని అదుపులోకి తీసుకొని చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ తహసీల్దార్ మోహతాజ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.


తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

సంతమాగులూరు(అద్దంకి రూరల్): సుప్రీం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషన్‌రామకృష్ణ గవాయ్‌పై అణగారిన దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలని ఎంఆర్‌పీఎస్ సంతమాగులూరు మండల అధ్యక్షుడు పల్లెపోగు మహేంద్ర మాదిగ అన్నారు. శుక్రవారం మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఆర్, ప్రజా సంఘాల ఆధ్వరంలో సంతమాగులూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. గవాయ్ దాడి వెనుక ఉన్న కుట్రలపై విచారణ జరపాలన్నారు. కార్యక్రమంలో జిర్ర విజయ్ బాబు, అమృతపూడి కరుణాకర్, చింతపల్లి సునీల్, లక్కపోగు జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడి చేసిన దోషులను శిక్షించాలని ఎంఎస్‌పీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మీనరసయ్య అన్నారు. శుక్రవారం ఇంకొల్లు మండలంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ ఏపీఎస్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. పల్లెపోగు నాని, వల్లేరు సూర్య, ఒలేరు భాను పాల్గొన్నారు.

కారంచేడు: గవాయిపై జరిగిన అమానుష దాడి హేయమైన చర్య అని నాయకులన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. బుడంగుంట్ల లక్ష్మీనర్సయ్య మాదిగ, గానుగపాటి సురేంద్ర మాదిగ, రవితేజ మాదిగ, తేళ్ళ పుల్లరాజు పాల్గొన్నారు.

దాతల సహకారం సద్వినియోగించుకోండి


స్టడీమెటీరిల్ అందుకున్న విద్యార్థులు

వేటపాలెం: దాతల సహకారాన్ని సద్వినియోగించుకొని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ప్రధానోపాధ్యాయురాలు దేవరకొండ సరోజిని పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 100 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్ ఉచితంగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ రూపొందించిన బ్లూప్రింట్ ప్రకారం ఉపాధ్యాయులు కె. సరళాదేవి, జి. గురుమణి మెటీరియల్ ఉచితంగా అందజేశారన్నారు. విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువుకొని మంచి మార్కులు సాధించాలని సూచించారు. డి. లక్ష్మీనారాయణ, ఎల్. అంజమ్మ, ఎం. రాంబాబు, పి. సునీత పాల్గొన్నారు.

వీధికుక్కల దాడితో మరో గొర్రె మృతి


కుక్కల దాడితో చనిపోయిన గొర్రె

బల్లికురవ: కొప్పరపాడు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి వీధికుక్కలు షేక్ వలి గొర్రెల దొడ్డిలోకి ప్రవేశించి 15 గొర్రెలను హతమార్చిన విషయం విదితమే. గురువారం అర్ధరాత్రి గొర్రెల కాపర్లు అప్రమత్తంగా ఉన్నా రెండు కుక్కలు దొడ్డిలోనికి ప్రవేశించి మరో గొర్రెను చంపేశాయి. ఇప్పటికైనా కుక్కలను గ్రామానికి దూరంగా తరలించేలా చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షుడు బండారు నాగయ్య.. స్థానిక నేతల మూఢవత్ దానానాయక్, బుర్రి ఆదినారాయణ, గ్రామస్తులు వేడుకుంటున్నారు.

ప్రపంచ ఆరోగ్య బృందం ఇంటింటా తనిఖీ

బల్లికురవ: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో అందుతున్న వైద్యసేవలపై గురువారం ఆరోగ్య బృందం ఇంటింటా తనిఖీ చేపట్టింది. టమండలంలోని ఉప్పుమాగులూరు పంచాయతీలోని సోమవరప్పాడులో జరిగిన కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎస్. వెంకటేశ్వరరావు, ఏఎన్ఎం హసీనా, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇంటి సామగ్రి దగ్ధం

మేదరమెట్ల: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లో మంటలు వ్యాపించి సామగ్రి దగ్ధమైన సంఘటన కొరిశపాడు మండలం మేదరమెట్ల సెంటరులో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన స్వరూపా దేవి డ్రైక్లీనింగ్ షాపులో మంటలు చెలరేగడంతో ఫైర్ సిబ్బంది అదుపు చేశారు.

చందలూరు ప్రాథమిక పాఠశాల తనిఖీ

జె.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సమగ్ర శిక్ష ఈఈ నాగజ్యోతి, ఏపీసీ నాగిరెడ్డి పరిశీలించారు. పాఠశాలకు సంబంధించి రెండు తరగతి గదులు శిథిలావస్థలో ఉండటంతో నూతన రూములు ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరు చేయిస్తామని తెలిపారు. ఎంఈఓ వీరాంజనేయులు పాల్గొన్నారు.

దుకాణాల వద్ద నిబంధనలు పాటించండి

కారంచేడు: దీపావళి పండగ పురస్కరించుకొని బాణసంచా దుకాణాల వద్ద తప్పకుండా అగ్ని ప్రమాద నియంత్రణలను పాటించాలని ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య అన్నారు. శుక్రవారం యజమానులకు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం అన్ని అనుమతి పత్రాలు ఉండాలన్నారు. కారంచేడు ఎస్ఐ ఖాదర్‌బాషా, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛ కాపాడండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

అద్దంకి: పత్రికా స్వేచ్ఛ కాపాడాలని కోరుతూ నియోజకవర్గంలోని జర్నలిస్టులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ శ్రీ చరణ్‌కు వినతిపత్రం అందజేశారు. మద్యం అక్రమాలపై వార్త కథనానికి సబంధించి సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, నెల్లూరు సాక్షి జిల్లా కార్యాలయానికి పోలీసులు నోటీసులు ఇవ్వడం, ఆధారాలు ఇవ్వాలని బెదింపులకు పాల్పడటంపై జర్నలిస్టులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దంకి తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి, తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వాస్తవాలు రాస్తున్న పాత్రికేయులపై కక్ష సాధింపులకు పాల్పడుతోందని, పాత్రికేయులన పోలీసులతో బెదిరించి వార్తలు రాయకుండా చేసే విధంగా చేస్తోందన్నారు. సాక్షి ఎడిటర్‌పై పెట్టిన కేసుల ఎత్తివేసి, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నరిశెట్టి నాగేశ్వరరావు, దాసు, సంగయ్య, రావుట్ల శ్రీనివాసరావు, జి. ఆంజనేయులు, చంద్రయ్య, చిరంజీవి, అనిల్, సోమ శ్రీనివాసరావు, ఇతర జర్నలిస్టులు పాల్గొన్నారు.

పదవుల కోసం కాదు.. పార్టీ కోసం పని చేయండి


అరుణ్‌ను అభినందిస్తున్న ఇన్‌చార్జ్ మధుసూదన రెడ్డి

పర్చూరు(చినగంజాం): పదవుల కోసం కాకుండా పార్టీ కోసం నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని పర్చూరు నియోజక వర్గ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన జిల్లా సెల్ కార్యదర్శిగా నియమితులైన పులిపాటి అరుణ్‌ను శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మైలా చిననాగేశ్వరరావు, కురాకుల ఇసాక్, కట్టారత్న రాజు, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి గోపతోటి బాబురావు, తలకాయల కోటి తదితరులు పాల్గొన్నారు.

రావినూతల విద్యార్థినికి ప్రథమ స్థానం

మేదరమెట్ల: చీరాలలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ సెమినార్ పోటీలో కొరిశపాడు మండలం రావినూతల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న సీహెచ్ మధువర్షిత అత్యుత్తమ ప్రతిభతో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలించింది. పాఠశాల ఉపాధ్యాయుల అభినందించారు. రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం రాఘవరెడ్డి శుక్రవారం తెలిపారు.

మాజీ ఎమ్మెల్సీ మాణిక్యరావుకు నివాళి

చీరాల రూరల్: ప్రజల మనిషిగా సామాజిక సేవకుడిగా తన జీవితాన్ని త్యాగం చేసి చరిత్రలో చిరస్థాయిగా మాజీ ఎమ్మెల్సీ ఎంజే మాణిక్యరావు నిలిచిపోయారని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఎంజే మాణిక్యరావు శత జయంతి వేడుకలు శుక్రవారం స్థానిక సెయింట్ మార్క్స్ లూథరన్ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిథుల చేతులు మీదుగా జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు అధ్యక్షతన వహించిన కార్యక్రమంలో ఎంజే మాణిక్యరావు కుమారుడు విజయ్‌కుమార్, గుంటూరు ఏసీ కాలేజీ ప్రిన్సిపాల్ మోజెస్, స్థానిక కళాశాల కరస్పాండెంట్ శీలం విద్యాసాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికలు జాగ్రత్తలు తీసుకోవాలి


కోలలపూడిలో కుర్చీల ఆట ఆడుతున్న బాలికలు

మార్టూరు: అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండలంలోని కోలలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఐసీడీఎస్ ద్రోణాదుల సెక్టర్ సూపర్‌వైజర్ కె. పద్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలికలు ఎదిగే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. విజేతలైన బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్ణ, పద్మ పాల్గొన్నారు.

అర్జీల విచారణ వేగవంతం చేయండి

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ సూచించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాస్ పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ, నాలా కన్వర్షన్, అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు సత్వరంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పనిచేయాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు తమకు కేటాయించిన విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామాల వారీగా పెండింగ్‌లో ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలను త్వరగా అందించడంతో పాటు గ్రామాల్లో ఎక్కడా కూడా అనధికార లేఅవుట్లు వేయకుండా కట్టడి చేయాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ, వీఆర్వోలున్నారు.